క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరురూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని పీలేరు డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 6.15 గంటలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. రానుపోనూ టికెట్ ధర్ రూ. 700 నిర్ణయించడం జరిగిందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441774743 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండాలి

పెద్దమండ్యం : ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. గురువారం బీఎల్‌ఓలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలపై సమీక్షించారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లను తొలగించాలన్నారు. ఓటర్ల తొలగింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటర్ల నమోదు చర్యలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల నుంచి కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు.

దారి సమస్యపై పరిశీలన

పీలేరురూరల్ : మండలంలోని జాండ్ల పంచాయతీ నల్లగుట్టపల్లె తండాకు చెందిన పార్వతమ్మ తన ఇంటి ఎదుట దారి ఆక్రమణపై బుధవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ గురువారం తన సిబ్బందితో నల్లగుట్టపల్లెకు చేరుకుని సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇరు వర్గాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దారి సమస్య గ్రామానికి చెందినదని, ఇరు వర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హేమంత్ నాయక్, సర్వేయర్ మహేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో గురువారం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2025–26 మొదటి సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు వృత్తి విద్యా కోర్సులు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మదనపల్లె పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శివపార్వతి, శ్రీదేవి, మాలతి, రమణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం, బెల్లం ఊట ధ్వంసం


కర్నాటక మద్యంను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.13,78,390 విలువచేసే నాటుసారా, కర్నాటక మద్యం, బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. గురువారం మధ్యవర్తుల సమక్షంలో 56 నాటుసారా కేసులలో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.5,66,700 విలువ కలిగిన 1889.3 లీటర్ల నాటుసారా, 132 అక్రమ కర్నాటక మద్యం కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారుగా రూ.6,32,500 విలువ కలిగిన 863.81 లీటర్ల అక్రమ మద్యం, 56 లీటర్ల బీర్, 18 డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.72,190 విలువ చేసే 84.93 లీటర్ల డ్యూటీ పెయిడ్ లిక్కర్, 650ఎం.ఎల్.బీర్‌ను వాటి కంటైనర్లతో సహా నాశనం చేశారు. అదేవిధంగా 6 కేసులలో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.1,07,000 విలువ కలిగిన 2,139.55 కిలోల బెల్లంను నీటిగుంటలో పారబోసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భీమలింగ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మదనపల్లె : మున్సిపల్ ఉద్యోగిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన నేపథ్యంలో గురువారం డీఎస్పీ డి. కొండయ్యనాయుడు మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, మురళీకృష్ణ మధ్య మంగళవారం ఇంటి పన్ను బిల్లుకు సంబంధించి గొడవ జరిగింది. గొడవలో మురళీకృష్ణ మద్యం సేవించి, తనపై దాడిచేసి కులంపేరుతో దూషించినట్లు శ్రీనివాసులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదైంది. దీంతో డీఎస్పీ కొండయ్యనాయుడు, వన్‌టౌన్ సీఐ ఎరీషావలీతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. మున్సిపల్ బట్వాడా అసిస్టెంట్ మజ్జిగ మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఘర్షణ పడిన ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులను రీజనల్ డైరెక్టర్ కుప్పం మున్సిపాలిటీకి బదిలీ చేసినట్లు తెలిసింది.




• తూనీగ.. తూనీగ

తూనీగలు ప్రకృతిలో ఒక అందమైన భాగం. అవి చిన్నవిగా ఉండి, ఎగిరేటప్పుడు చాలా సున్నితంగా ఉంటాయి. పల్చటి రెక్కలతో రంగులన్నీ బయటకి పారబోస్తూ ఎగురుతాయి. మబ్బులు పట్టిన సాయంకాలాలు గుంపుగా శూన్యంలో పరిగెత్తుతాయి. వాతావరణ మార్పుల పట్ల ఇవి బాగా ప్రభావితమవుతాయి. రంగు రంగుల తూనీగలు చెట్టు కొమ్మల మీద వాలుతూ ప్రకృతి ప్రేమికులను ముగ్ధులను చేస్తాయి. మదనపల్లె మండలం పెంచుపాడు సమీపంలోని గొలపల్లిలో చెరువు వద్ద చెట్టుకొమ్మలపై గురువారం తూనీగలు వాలాయి. వివిధ రంగుల తూనీగలను వెల్‌విషర్స్ ట్రక్కర్స్ కెమెరాల్లో బంధించారు. ఈ కీటకాలు ఐదు వేల రకాల వరకు ఉన్నాయి. కొన్ని ఏడాదే బతికితే.. కొన్నేమో ఐదేళ్ల వరకు బతకగలవు. - మదనపల్లె సిటీ




దాహం తీరే దారేదీ?

వానా చలికాలలతో పోల్చితే ఎండాకాలంలో సగటు మనిషి మూడు, నాలుగు రెట్లు అధికంగా తాగునీరు తీసుకుంటాడు. బయటకు వెళ్లిన వ్యక్తి ఇంకా ఎక్కువే తీసుకోవాలి. లేకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వేసవిలో నీరు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తారు. కానీ ఇవన్నీ మదనపల్లె మున్సిపల్ అధికారుల చెవికి ఎక్కడం లేదు. మండే ఎండలకు పట్టణంలో ఒక్క చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

- జాడ లేని చలివేంద్రాలు
- గతంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ
- ప్రస్తుతం ఆ ఊసే ఎత్తని వైనం
- అల్లాడుతున్న కూలీలు, పాదాచారులు


చలివేంద్రం కనిపించని మల్లికార్జున సర్కిల్

మదనపల్లె సిటీ : ఎండాకాలంలో పాదాచారులు, వాహన చోదకులు, దప్పికగొన్నవారి వారికి దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఈ ఏడాది కనిపించడం లేదు. మున్సిపల్ కేంద్రమైన మదనపల్లె పట్టణంలో గతంలో మున్సిపాలిటీ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎక్కడ కన్పించలేదు. డివిజన్ కేంద్రమైన మదనపల్లెకు నిత్యం పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం ఏదో పని మీద వస్తుంటారు. ఆర్టీసీ బస్టాండుకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. టమటా మార్కెట్‌కు రైతులు, వ్యాపారులు, లారీ డ్రైవర్లు, హమాలీలు అధికం ఉంటారు. దాహం తీర్చుకునేందుకు షాపులకు వెళ్లి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

మండుతున్న ఎండలు

మార్చి నెల మొదటి వారం నుంచి ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు మరింత ముదిరిపోయాయి. పనుల మీద బయటికి వెళ్లిన వారు దాహార్తి తీర్చేకునేందుకు చలివేంద్రాలు లేక అల్లాడుతున్నారు. ముఖ్యంగా పాదాచారులు, దినసరి కార్మికులు, తోపుడుబళ్లవాళ్లు, బిచ్చగాళ్లు మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కల్పించే చలివేంద్రాలు లేక నానా అవస్థలు పడుతున్నారు.

దాహార్తి తీర్చేకునేందుకు అవస్థలు

ఈ ఏడాది ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పట్టణంలో ప్రధానంగా బెంగళూరు బస్టాండు, మల్లికార్జున సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, చిత్తూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్, నీరుగట్టువారిపల్లెలో చలివేంద్రాలు లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో అడుగడుగునా చలివేంద్రాలు కన్పించేవి. నేడు వాటి జాడలు కన్పించలేదు. ఎండలోనే కాయకష్టం చేసుకునేవారు బయటి పనులపై తిరిగి వారు ఇబ్బంది పడుతున్నారు.

గొంతెండుతోంది



గతంలో ఎండా కాలం వస్తే చాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. తాగు నీటికి ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు ఎక్కడ అంటువంటివి కనిపించడం లేదు. కాయకష్టం చేసుకుని బతికే వాళ్లం డబ్బులు పెట్టి నీళ్లు కొనలేకపోతున్నాం. – జమ్రూత్‌బాషా, మదనపల్లె

రేపు హెల్పింగ్‌మైండ్స్ వార్షికోత్సవం

మదనపల్లె సిటీ : హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ తెలిపారు. స్థానిక కదిరిరోడ్డులో శ్రీ కృష్ణా కల్యాణమండపంలో జరిగే వార్షికోత్సవ వేడుకలకు ప్రముఖ సినీ నటుడు షఫీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు మండల సమావేశం

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని, అదే విధంగా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్రమైన ప్రగతి నివేదికలతో రావాలని కోరారు.

శుభకార్యాల్లో పాల్గొన్న నిసార్ అహ్మద్

మదనపల్లె : నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పట్టణంలోని పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేజే కూరగాయల మండి యజమాని ఖాజాపీర్ కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. అనంతరం మండలంలోని చిప్పిలి చిట్టిఅన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో జరిగిన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ కుమారుడి నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్నారు. కాబోయే దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు బీరంగి రేవతి, వైజయంతి, మధు, ఎల్ఐసీ సుధాకర్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

పీకేఎం–ఉడా నిధులతో రామ్‌నగర్ పార్క్ అభివృద్ధి

జేసీ ఆదర్శ రాజేంద్రన్


ఇంజనీరింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : పట్టణంలోని రామ్‌నగర్ మున్సిపల్ పార్కును పీకేఎం–ఉడా నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. గురువారం పీకేఎం–ఉడా కార్యాలయంలో చైర్‌పర్సన్ హోదాలో జాయింట్ కలెక్టర్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి ఆర్టీసీబస్టాండ్ సమీపంలోని రామ్‌నగర్ పార్కును సందర్శించారు. పార్కులో చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పార్కు విస్తీర్ణం 2.5 ఎకరాలు కాగా, అందులో టెన్నిస్‌కోర్టు పోనూ మిగిలిన ప్రాంతాల్లో ఏఏ పనులు చేస్తే బాగుంటుందనే విషయమై చర్చించారు. పీకేఎం–ఉడా నుంచి రామ్‌నగర్ పార్కు అభివృద్ధికి రూ.40లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మొత్తం నుంచి పార్కులో గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. వాకింగ్ ట్రాక్‌తో పాటుగా జిమ్ ఎక్విప్‌మెంట్, ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటుచేస్తే యువత వినియోగించుకునే వీలుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు మహేష్, శ్రావణి, ఏఈ రూపేష్, టీపీఓ జకీరా, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వేలం నిర్వహణ ఇష్టానుసారమా!

- గ్రామదేవత గదులు, భూములకు లీజుపై నిలదీసిన ప్రజలు
- వెనక్కు తగ్గి వాయిదా వేసిన అధికారులు


వేలంపాట వాయిదా వేయాలని అధికారులను కోరుతున్న ప్రజలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట గ్రామదేవత ఆలయానికి చెందిన వాణిజ్య గదులు, భూములను లీజుకు ఇచ్చే వేలంపాటలను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నిర్వహిస్తారా అని దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులను ప్రజలు నిలదీశారు. గురువారం వేలం పాటలను నిర్వహించేందుకు ఆలయానికి వచ్చిన ఈఓ మునిరాజ, మదనపల్లె ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ సిద్ధమయ్యారు. పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలు వేలంతీరుపై ఆక్షేపించారు. నిబంధనలు ఏం చెబుతున్నాయి, ఎప్పుడు వేలం వేయాలో చెప్పాలని పట్టుబట్టారు. గదులను ఖాళీ చేయించాక వేలం నిర్వహించాలని కోరారు. బీరంగిరోడ్డులోని భూములను వినియోగించుకుంటున్న వారిని కూడా ఖాళీ చేయించాక వేలం వేయండంటూ డిమాండ్ చేశారు. రోడ్డుపై ఉన్న భూమికి ప్లాట్లు చేసి ఖాళీ స్థలాలను లీజుకు అప్పగిస్తే ఆలయానికి ఏటా లక్షల్లో ఆదాయం వస్తుందని, అలా చేయకుండా కేవలం భూమిని లీజుకు ఎలా ఇస్తారని నిలదీశారు. గదులను ఖాళీ చేయించకుండా వేలంలో హెచ్చుపాటదారునికి గదిని అప్పగిస్తారా అని ప్రశ్నించారు. ఖాళీ చేయకపోతే శాఖాపరంగా చర్యలు తీసుకుంటారా అన్నదానిపై ఈఓ సమాధానం ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రజలందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వేలంపాటలు నిర్వహించే నాటికి పాటదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు పూర్తి చేయాలని కోరారు. అయినా అధికారులు వేలం వేసేందుకు మొగ్గుచూపగా.. హాజరైన వారిలో ఒక్కరూ పాటలకు సిద్ధం కాలేదు. దీంతో అధికారులు వేలంపాటలను వాయిదా వేస్తున్నామని, తదుపరి వేలం తేదిని ప్రకటిస్తామని చెప్పి వెళ్లిపోయారు. దీనిపై జిల్లా అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ పాటదారుల సూచన మేరకు గ్రామదేవత ఆలయానికి చెందిన లీజుల వేలం వాయిదా వేశామని చెప్పారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన చింతల


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ స్థితిగతులు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలపై మాజీ మంత్రితో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మాజీ మంత్రి ఆరోగ్య స్థితిపై విచారించి, పూర్తి స్థాయిలో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనంద రెడ్డి తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు కోరారు గురువారం స్థానిక డిపో కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మొదటి రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ. 400 చేయాలని కోరారు. హైయర్ పెన్షన్ సమస్య సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ కొనుగోలు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్యవిధానం అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు ఖాజాపీర్, ఆనంద, పి.వి. నాయుడు, సి.వి. రమణ, ఆదినారాయణ, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


టెక్నికల్ సింపోసియంను ప్రారంభిస్తున్న ఆర్యన్ రాజ్‌పుత్

కురబలకోట : సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటర్నెట్ ఆధారంగా జరిగే మోసాలను అవగాహనతో నియంత్రించవచ్చని హైదరాబాదు అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈఓ ఆర్యన్ రాజ్‌పుత్ హెచ్చరించారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో గురువారం టెక్నికల్ సింపోసియం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నా సైబర్ మోసాలు తగ్గడం లేదన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం అధికంగా ఉన్నందున మోసగాళ్లు ఎప్పటికప్పుడు రకరకాలుగా కొత్త ఎత్తులతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత లింకులను టచ్ చేయవద్దని సూచించారు. విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విస్తృత స్థాయిలో పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు.

సన్మానం


ఎంపీ మిథున్‌రెడ్డికి బొకే అందజేస్తున్న నూరుల్లా

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ లోక్‌సభపక్ష నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని గురువారం మదనపల్లె టౌన్ వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ టీఎస్. నూరుల్లా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించి పట్టణ జనరల్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి.. పట్టణంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసి, రానున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించినట్లు టీఎస్.నూరుల్లా తెలిపారు.

ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన దిగుబడి


రాయితీ కవర్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఓ సుకుమార్‌రెడ్డి

పీలేరు : నాణ్యమైన దిగుబడి సాధించేందుకు ఫ్రూట్ కవర్లు ఎంతో ఉపయోగపడుతాయని ఉద్యానవన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి సూచించారు. గురువారం రైతులకు మామిడి కవర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో అందించే కవర్లను మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాలకు 3 లక్షలు కవర్లు 30 వేల హెక్టార్లకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకు 10 వేల కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవరు రూ. 2.20 పైసలు కాగా ఒక్క రూపాయి రాయితీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. మామిడికి కవర్లు కట్టడం ద్వారా గాలికి, వడగండ్లకు తట్టుకోవడం తోపాటు చీడపీడలు సోకవని తెలిపారు. దీంతో మామిడికి మంచి మార్కెటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ప్రవీణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర్‌రాజు

కలికిరి(వాల్మీకిపురం) : వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎంపీడీఓ మనోహర్ రాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సమస్యపై తమ దృష్టికి తెస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు అమలవుతున్న పథకాలు, ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు పామిలేటి, జెడ్పీటీసీ నిర్మల, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాల

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల గ్రామంలో కుషావతీ నది ఒడ్డున విప్పవనంలో వెలసిన పోలేరమ్మ తల్లి తిరునాల ఉత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కలిచెర్ల సింగిల్ విండో మాజీ చైర్మన్ సుధాకరరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి కుటుంబ సభ్యులకు పోలేరమ్మ తల్లి ఇలవేల్పు దేవత. శుక్రవారం పోలేరమ్మ తల్లి మెట్టినిల్లు కలిచెర్ల నుంచి, పుట్టినిల్లు మిట్టావాండ్లపల్లెకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్తారని చెప్పారు. అలాగే శనివారం ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం రాత్రి జరిగే తిరునాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్నాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు.

నవోదయం 2.0 విజయవంతం చేయాలి

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజు కోరారు. గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించి మదనపల్లె డివిజన్ పరిధిలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. జయరాజు మాట్లాడుతూ నాటుసారా తయారుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి పొందేలా బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు సహకరించాలన్నారు. కల్తీ మద్యం వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను నిర్మూలించడంలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నాటుసారా తయారీదారులు, గంజాయి, డ్రగ్స్ విక్రయించేవారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదుచేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ మధుసూధన్, ఎక్సైజ్ సీఐలు భీమలింగ, లత, మాధవి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై పట్టాభిరాముడి వైభవం


అశ్వవాహనంపై కొలువుదీరిన పట్టాభిరాముడు

కలికిరి (వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అశ్వవాహనంపై పురవీధుల్లో ప్రజలను కటాక్షించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణలతో తిరుచ్చిలో వేంచేపు చేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సాయంత్రం పట్టాభిరాముడికి ఊంజల్‌సేవ కనుల పండువగా నిర్వహించారు. రాత్రి కైంకర్యాల అనంతరం ఊంజల్ సేవ వైభవంగా సాగింది. అనంతరం విశేషాలంకితుడైన పట్టాభిరాముడు విల్లంబులు ధరించి అశ్వవాహనంపై పార్వేట బయలుదేరడం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ సందర్భంగా బళ్లారివాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

పెద్దతిప్పసముద్రం : మోడల్ స్కూళ్లలో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 20న జరగాల్సిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి నిర్వహిస్తామని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. 20న ఈస్టర్ సందర్భంగా పరీక్షను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు.

రామసముద్రం : మండలం దిన్నిపల్లి సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ గురువారం తెలిపారు. ఈనెల 20న నిర్వహించాలకున్న ప్రవేశ పరీక్ష 21 సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

నిర్మాణాలు తొలగింపు

పీలేరు : ఆర్‌ఓబీ నిర్మాణంలో భాగంగా స్థానిక చిత్తూరు రోడ్డు మార్గం రైల్వేగేటు వద్ద నిర్మాణాలను అధికారులు తొలగించారు. గతంలో కొన్ని సమస్యాత్మక ఇళ్లు, కట్టడాలు తొలగించకుండా ఆర్‌ఓబీ పనులు చేపట్టారు. గురువారం పెండింగ్‌లో ఉన్న నిర్మాణాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు తొలగించారు. దీంతో ఆర్‌ఓబీ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.